క్లుప్తంగా

రేపు మున్సిపల్ బహిరంగ వేలం

గూడూరు: ఈ నెల 27వ తేదీన 2024–25 ఆర్థిక సంవత్సరానికి మున్సిపల్ వేలాలు నిర్వహిస్తామని కమిషనర్ వి.దివాకర రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వారపు సంత, దినసరి కారగాయల మార్కెట్, పెద్ద పశువుల మార్కెట్, తదితర వాటికి వేలాలు ఉంటాయని పేర్కొన్నారు.

కేసీ కాల్వకు నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం కేసీ కాల్వకు ఆదివారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.201 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

గడివేముల: బిలకలగూడూరు నుంచి గడిగరేవులకు వెళ్తున్న వ్యక్తి బైకు అదుపుతప్పడంతో గాయాలయ్యాయి. గడిగరేవుల గ్రామానికి చెందిన అనిల్ సొంత పనుల నిమిత్తం బిలకలగూడూరు గ్రామానికి వెళ్లాడు. పనుల అనంతరం బైకుపై వస్తుండంగా గ్రామ సమీపంలో బైకు అదుపుతప్పి కిందపడటంతో గాయాలయ్యాయి. క్షతగాత్రుడికి గడివేములలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేశారు.

ఇసుక అక్రమ తరలింపు కేసులో నోటీసులు జారీ



సీజ్ చేసిన హిటాచీ

కర్నూలు (న్యూటౌన్): ఫిబ్రవరి 21న కౌతాళం మండలం మరళి గ్రామ పరిధిలో అక్రమంగా ఇసుక తవ్వుతున్న కర్ణాటకకు చెందిన హిటాచీని సీజ్ చేసి నోటీసులు జారీ చేశామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తెలిపారు. రెవెన్యూ, మైనింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. మైనింగ్ డీడీ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తవ్వుతున్న హిటాచీని సీజ్ చేసి కౌతాళం పోలీస్ స్టేషన్‌లో పెట్టామన్నారు. హిటాచీ యజమాని కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా మాన్వి గ్రామానికి చెందిన శరణబసవ అని విచారణలో తేలిందన్నారు. కర్ణాటక నుంచి ఏపీలోకి హిటాచీతో ప్రవేశించి అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపినందుకు నోటీసు జారీ చేశామన్నారు.

డీఎస్సీలో ఉర్దూ ఖాళీలన్నీ భర్తీ చేయాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నాయకుడు

గడివేముల: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ ఈ డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ సయ్యద్ అబ్దుర్ రఖీబ్ కోరారు. ఈ మేరకు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి ఆదివారం వినతి పత్రం అందజేశారు. గడివేముల మండలం బిలకలగూడూరు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కాటసానిని ఉర్దూ ఉపాధ్యాయులు కలిశారు. ఉర్దూ ఉపాధ్యాయులు తక్కువగా ఉండటంతో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

ఉత్సవాలపై సమీక్ష

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో వచ్చే నెల 8వ తేదీ నుంచి జరుగనున్న శ్రీ నాలింగేశ్వర, కేశవస్వామి ఉత్సవాల నిర్వహణపై ఆదివారం ఆలయ కార్యనిర్వహణాధికారి గురెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వామి వారి ప్రభోత్సవం, రథోత్సవం, ఆలయ అలంకరణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామని చెప్పారు. ఉత్సవాల అనంతరం మాన్యం కౌలుకు వేలం పాట చేపడతామని తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



టీ షర్ట్సను పంపిణీ చేస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి జర్నలిస్టు టోర్నమెంట్‌లో పాల్గొంటున్న జిల్లా జట్టుకు ఆదివారం గాయత్రీ ఎస్టేట్‌లోని ఆయన క్లినిక్‌లో టీ షర్ట్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ నిత్యం వార్తల సేకరణలో బిజీగా ఉండే జర్నలిస్టులకు కాస్త ఉపశమనం కోసం క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ ఒత్తిడి లేకుండా సమాజంలో ధైర్యంగా వార్త సేకరణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జట్టు సభ్యులు మోహన్, శివరాజ్‌కుమార్, వెంకటేష్, ప్రకాశ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆనందమే సీఎం జగన్ లక్ష్యం

- అభివృద్ధి పనుల్లో పాణ్యం నియోజకవర్గం అగ్రస్థానం
- సంక్షేమ పాలనను ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- బిలకలగూడూరులో సచివాలయం, ఆర్బీకే, సీసీ రోడ్లు ప్రారంభం



సీసీ రోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

గడివేముల: రైతుల కళ్లల్లో ఆనందం నింపడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని బిలకలగూడూరు గ్రామంలో రైతుభరోసా కేంద్రం, సచివాలయ భవనంతో పాటు సీసీ రోడ్లను ఆదివారం ప్రారంభించారు. రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు సింగిల్‌విండో అధ్యక్షుడు పోగుల చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకరరెడ్డి, భాస్కర్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏ ఒక్కరైతు కూడా నష్టపోలేదని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి పేద వారికి ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేయించడమే తన లక్ష్యమని, కుల,మత, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు.

ఇంటి వద్దకే అన్ని రకాల సేవలు

కుల, మత, పార్టీలకు అతీతంగా సచివాలయ, వలంటీరు వ్యవస్థతో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఏ చిన్న పని ఉన్నా మండల కేంద్రానికి వెళ్లే పరిస్థితి ఉండేది. టీడీపీ ప్రభుత్వంలో ఒక్క పథకం మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీ వద్దకు వెళ్లాల్సి వచ్చేదని, అయినా పనులు అయ్యేవి కావన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సచివాలయ, వలంటీరు వ్యవస్థను ఏర్పాటు చేయడంతో ప్రజల ఇంటి వద్దకే వెళ్లి అర్హత ఉన్నవారిని గుర్తించి, సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు.

విత్తు నుంచి విక్రయం వరకు అన్ని సేవలు

గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు నాటుకునేప్పటి నుంచి పంట దిగుబడులను అమ్ముకునేంత వరకు సేవలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు అడుగడుగునా అండగా నిలిచి వారిని చెయ్యి పట్టి నడిపించే లక్ష్యంతో ఆర్బీకే వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. వ్యవసాయ అనుబంధ సేవలన్నీ రైతుల ముంగిట్లోకే అందుబాటులోకి వచ్చాయన్నారు.



వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

అభివృద్ధిని జీర్ణించుకోలేకనే విమర్శలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నియోజవర్గం అంతా సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఎటువంటి వివక్ష లేకుండా పథకాల లబ్ధి అందిస్తున్నామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఇలా ఉంటే జీర్ణించుకోలేని కొన్ని విషపత్రికలు ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు. విషపు రాయడం మానుకుని ప్రజల్లోకి వెళ్లి విచారిస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి, సర్పంచ్‌లు నాగేశ్వరమ్మ, రామ్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ రామస్వామి, భోగేశ్వరం చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు కృష్ణారెడ్డి, ఎల్లారెడ్డి, మేఘనాథరెడ్డి, పుల్లయ్య, బాలచెన్ని తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలి

సంక్షేమ పథకాలు అమలు కావాలంటే, నవరత్నాలు మీ ఇంటికి రావాలంటే మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కాటసాని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు.

నేడు ఆసరా చెక్కు పంపిణీ

గూడూరు రూరల్: మండలంలోని పెంచికలపాడు గ్రామంలో సోమవారం కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆదిమూలపు సతీష్ ద్వారా మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తారని సర్పంచు లతమ్మ ఆదివారం తెలిపారు. స్థానిక శివాలయం సమీపంలో ఉదయం 10 గంటలకు వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో చెక్కు పంపిణీ కార్యక్రమం జరుగనుందని చెప్పారు.

నేడు స్పందన

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గుర్రప్ప ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

గూడూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని డిప్యూటీ తహసీల్దార్ శారద ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి మండల అధికారులందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ అనుపమ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పందనకు గైర్హాజరయ్యే అధికారులపై చర్యల నిమిత్తం కలెక్టర్ కార్యాలయానికి నివేదిక పంపుతామని స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని మండలంలోని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

మళ్లీ వైఎస్‌ఆర్‌సీపీ జెండాను ఎగురవేద్దాం

- 30వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ జయన్న 100 మంది అనుచరులతో పార్టీలో చేరిక
- పార్టీ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కాటసాని



ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

కర్నూలు (న్యూటౌన్): ఎన్నికల్లో సైనికుల్లా పని చేసి పాణ్యం నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేద్దామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వైఎస్‌ఆర్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కల్లూరు అర్బన్‌లోని షరీన్‌నగర్‌లో తెలుగుదేశం పార్టీకి చెందిన 30వ వార్డు ఇన్‌చార్జ్ జయన్నతో పాటు 100 మంది ఆదివారం వైఎస్‌ఆర్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కాటసాని వైఎస్‌ఆర్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలన్నా, ఇంటి వద్దకే రావాలన్నా ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటే ప్రతి కుటుంబానికి మేలు జరుగుతుందన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీలో చేరిన జయన్న తదితరులు ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంగాల సుదర్శన్‌రెడ్డి, దండు లక్ష్మీకాంత్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, కల్లూరు సహకార సంఘం అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ రమణారెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హేమలత, తిరుపాలు, శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీ దేవికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్

కోడుమూరు రూరల్: పట్టణంలో వెలసిన శ్రీచౌడేశ్వరీ దేవి ఉత్సవాలను పురస్కరించుకొని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజవకర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఆదివారం అమ్మవారికి స్థానిక నేతలతో కలిసి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు ఆలయ అభివృద్ధి, తిరునాల ఏర్పాట్లపై ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు. కోడుమూరు, కర్నూలు, గూడూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, ప్రసన్నకుమార్, మౌలాలి, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గ్రామ ఉపసర్పంచు మాదులు, మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, నాయకులు రవికుమార్‌రెడ్డి, మల్లారెడ్డి, లింగమయ్య, శివరాముడు, మగ్బుల్, మహమ్మద్ రఫీక్, లింగన్న, లింగమూర్తి, ప్రసాద్, వెంకటేష్ పాల్గొన్నారు.

సుబ్బరాయుడి సన్నిధిలో ఎంపీ, ఎమ్మెల్యే



నంద్యాల ఎంపీకి స్వామి వారి ప్రసాదాలు అందిస్తున్న దృశ్యం



మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి ప్రసాదాలు అందిస్తున్న ఈఓ, ప్రధానార్చకులు

పాణ్యం: మండల పరిధిలోని ఎస్ కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈఓ రామకృష్ణ, ఆలయ ప్రధానార్చకులు నారాయణ స్వామి, వీరయ్యస్వామి, సురేష్‌శర్మలు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి అభిషేకం, పూజలు నిర్వహించుకున్నారు. వారికి స్వామి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఓర్వకల్లు: మండల పరిధిలోని నన్నూరు గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ఆళ్లగడ్డ డిపోకు చెందిన ఏపీ03జెడ్ 5194 నంబరు గల ఆర్టీసీ బస్సు నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తుండగా నన్నూరు వద్ద టైరు పంక్చరై వ్యతిరేక దిశలో వస్తున్న పుల్లగుమ్మికి చెందిన ఏపీ39 యూ0454 నంబర్ గల ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో ముందు భాగం నుజ్జునుజ్జు కాగా ఉరుకుందమ్మ, వీరేష్, రవికుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

పకడ్బందీగా గ్రూప్–2 పరీక్షలు



శాంతిరాం కాలేజీ వద్ద హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

పాణ్యం: మండలంలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల, శాంతిరాం ఫార్మసీ కళాశాలల్లో గ్రూప్–2 పరీక్షలు ఆదివారం పకడ్బందీగా జరిగాయి. పరీక్ష కేంద్రాల వద్ద పాణ్యం సీఐ నల్లప్ప ఆధ్వర్యంలో ఎస్‌ఐలు అశోక్, వెంకటసుబ్బయ్య సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కేంద్రాల వద్దకు అభ్యర్థులు గంట ముందే వచ్చి తమకు కేటాయించిన స్థానాలు చూసుకున్నారు. పోలీసులు, కళాశాల సిబ్బంది ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా పరిశీలించి కేంద్రాల్లోకి పంపారు. ఆర్జీఎంలో 800 మంది గాను 706 హాజరు కాగా 94 గైర్హాజరయ్యారు. అలాగే శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో 1,201 మంది గాను 174 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తెలిపారు. అలాగే శాంతిరాం ఫార్మసీలో 500 మందికి గాను 58 మంది పరీక్షకు హాజరుకాలేదని ప్రిన్సిపాల్ మధుసూదన్‌శెట్టి వెల్లడించారు. పలువురు అభ్యర్థులు ఆలస్యంగా కేంద్రాల వద్దకు రావడంతో పోలీసులు, పరీక్షల సిబ్బంది వెనక్కి పంపారు.

పల్లెకు శుద్ధజలం

- పది గ్రామాలకు నగరాభివృద్ధి కింద రూ.80 లక్షలు కేటాయింపు
- కుడా నిధులతో ఆర్‌ఓ ప్లాంట్ల ఏర్పాటు
- తీరిన దాహార్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ముడుమాలలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్

సి.బెళగల్: కర్నూలు నగరాభివృద్ధి సంస్థ (కుడా) సహకారంతో మండలంలోని గ్రామాలలో శుద్ధజల కేంద్రాలు ఏర్పాటు చేసి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. మండలంలోని గ్రామాల్లో నెలకొన్న మంచి నీటి సమస్యను ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన కుడా నిధులతో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయించారు. దీంతో ఆయా గ్రామాలకు స్వచ్ఛమైన నీరందుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పది గ్రామాలకు రూ.80 లక్షలు మంజూరు..

మండలంలో మంచినీటి సమస్య ఉన్న పది గ్రామాలకు కుడా నిధులు మంజూరు చేయడంతో హుటాహుటిన ప్లాంట్ల నిర్మాణాలు ప్రారంభమ య్యాయి. ఒక్కో ప్లాంట్‌కు రూ.8 లక్షల చొప్పున 10 గ్రామాలకు రూ.80 లక్షలు విడుదల చేశారు. ఎనిమిది గ్రామాల్లో ఆర్‌ఓ ప్లాంట్ల నిర్మాణాలు దాదాపు పూర్తి కాగా, మరో రెండు గ్రామాల్లో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మొదటి విడతలో పలుకుదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె, కె.సింగవరం, పల్‌దొడ్డి గ్రామాలకు మంజూరవగా వాటిల్లో పూర్తి స్థాయిలో ప్లాంట్ల ద్వారా శుద్ధ జలం సరఫరా అవుతోంది. రెండవ విడతలో మండల కేంద్రంతో పాటు చింతమానుపల్లె, ఇనగండ్ల, బ్రాహ్మణదొడ్డి, బురాన్‌దొడ్డి గ్రామాలకు నిధులు మంజూరు కావడంతో చింతమానుపల్లె గ్రామంలో ఆర్‌ఓ ప్లాంట్‌ను ఇటీవల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్ ప్రారంభించారు.

ఫ్లోరైడ్ గ్రామాలకు సంజీవని

మండలంలో తాగునీటిలో అధికశాతం ఫ్లోరైడ్ ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే కుడా నిధులతో ఆర్‌ఓ ప్లాంట్లు నిర్మించడంతో ఆయా గ్రామాల ప్రజలకు ఇవి వరంగా మారాయి. మండలంలో అధికంగా ఫ్లోరైడ్ నీటితో ఇబ్బందులు పడుతున్న పలుకుదొడ్డి, చింతమానుపల్లె, బురాన్‌దొడ్డి, బ్రాహ్మణదొడ్డి, సి.బెళగల్ గ్రామాల ప్రజలు శుద్ధ జలం అందుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పలుకుదొడ్డి ఆర్‌ఓ ప్లాంట్ పనితీరును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

గ్రామంలో మంచినీరు అందుతుంది



గతంలో మంచినీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. తుంగభద్ర నది నుంచి నేరుగా వచ్చే నీటినే తాగేవారు. ఇప్పుడు ఊర్లో రూ.8 లక్షల కుడా నిధులతో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులందరికీ శుద్ధజం అందుతుంది. ప్రజలకు మంచినీటి కష్టాలు తీరాయి.

– పెద్దక్క, ఈర్లదిన్నె, సర్పంచ్

నీటి కష్టాలు తొలగాయి



మాకు తాగేందుకు మంచి నీరు ఉండేది కాదు. తుంగభద్ర నది నీళ్లను తాగి చాలా సార్లు అనారోగ్యం బారిన పడ్డాం. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి మా ఊర్లో మంచినీటి ప్లాంట్ ఏర్పాటు చేశారు. మేమంతా ఆ నీటినే తాగుతున్నాం. ఇప్పుడు మాకు మంచినీటి ఇబ్బందులు తొలగాయి.

– రాములమ్మ, గృహిణి, ముడుమాల గ్రామం

ప్రజలు సక్రమంగా వినియోగించుకోవాలి



కర్నూలు నగరాభివృద్ధి సంస్థ నిధుల ద్వారా గ్రామాల్లో ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటు చేయించారు. మండలంలో పది గ్రామాలకు రూ.80 లక్షలు కేటాయించారు. ఇప్పటికే ఆరు గ్రామాల్లో ఆర్‌ఓ ప్లాంట్ల ద్వారా పూర్తి స్థాయి మంచినీటి సరఫరా జరుగుతుంది. ప్రజలు ప్లాంట్లను సక్రమంగా వినియోగించుకోవాలి.

– గోనేనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, సి.బెళగల్

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించొద్దు



వృద్ధులకు వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించరాదని కంటి వైద్య నిపుణులు డాక్టర్ జయప్రకాశ్ అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, బాలసాయి కంటి ఆసుపత్రి మెడికేర్ క్లినిక్, అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కర్నూలు గ్రేటర్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని గురురాఘవేంద్రనగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అవసరమైన వారికి ఉచిత మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. లయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలను అందించేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ సంస్థ తరపున సహకారాన్ని అందిస్తామన్నారు. విశ్వభారతి మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే అలంపూర్ సమీపంలోని ఇటిక్యాల గ్రామంలో జరిగిన వైద్య శిబిరంలో ఉచిత బీపీ, షుగర్ వ్యాధులకు పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ ఫరీదా, రాజేశ్వరి, సోమన్న, శ్రీనివాసులు, ఆర్‌ఎంపీ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ‘షబ్ ఏ బరాత్’



జిలేబీ విక్రయిస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): నగరంలో ఆదివారం షబ్ ఏ బరాత్ (బడీరాత్)ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రాత్రి అన్ని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక నమాజ్‌లు, ప్రార్థనలు చేశారు. అనంతరం ఖబరస్తాన్‌కు వెళ్లి చనిపోయిన తమ పూర్వీకుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాతబస్టాండు, కొత్త బస్టాండు, సీ క్యాంప్ సర్కిల్, బళ్లారి చౌరస్తాలో షబ్ ఏ బరాత్ సందర్భంగా రకరకాల జిలేబీలను తయారు చేసి విక్రయించారు.

క్షమాపణ కోరుకునే రాత్రి

ముస్లిం సోదరులందరూ ఎంతో భక్తిశ్రద్ధలతో నమాజ్‌లు, చదివి, దువా చేస్తూ తాము చేసిన పాపాలను క్షమించమని అల్లాహ్‌ను హృదయపూర్వకంగా ప్రార్థించే రోజు షబ్ ఏ బరాత్. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం షబాన్ నెలలో 15వ తేదీని షబ్ ఏ బరాత్‌గా జరుపుకుంటారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మానవులందరి భవిష్యత్తుకు ఈ రాత్రే మార్గనిర్దేశం చేస్తారని ముస్లింల విశ్వాసం. అల్లాహ్ తన భక్తుల రిజ్క్(జీవనోపాధి)ని తదుపరి సంవత్సరానికి నిర్ణయిస్తాడని నమ్ముతారు.